నమస్తే తెలంగాణ

# వికారాబాద్

I | హైదరాబాద్, శుక్రవారం 7 జూన్ 2024 | VIKARABAD

## రెండ్రోజులు వర్షసూచన



సిటీబ్యూరో, జూన్ 6 (నమస్తే తెలంగాణ): నైరుతి రుతుపవనాల ప్రభావంతో గురువారం గ్రేటర్‌లోని పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిశాయి. రాత్రి 9 గంటల వరకు ఖైరతాబాద్ సెస్స్ ప్రాంతంలో అత్యధికంగా 3.7 సెం.మీలు, కృష్ణానగర్‌లో 3.5, సికింద్రాబాద్ పాటిగడ్డలో 3.1, షేక్‌పేట, బన్సీలాల్‌పేటలో 3.0, ఫిల్మ్‌నగర్‌లో 2.4, గచ్చిబౌలి, బంజారాహిల్స్‌లో 2.2, హయత్‌నగర్, చందానగర్‌లో 1.9 సెం.మీల చొప్పున వర్షపాతం నమోదైనట్లు టీఎస్‌డీపీఎస్ వెల్లడించింది. రుతుపవనాల ప్రభావంతో రాగల మరో రెండు రోజులు గ్రేటర్ వ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.

## 'మీపై ముంబైలో కేసు నమోదైంది'

సిటీబ్యూరో, జూన్ 6 (నమస్తే తెలంగాణ): ఓయూలో ప్రొఫెసర్‌గా పనిచేసి రిటైర్డైన 80 ఏండ్ల వృద్ధుడికి టెలిఫోన్ డిపార్ట్‌మెంట్ నుంచి అంటూ ఫోన్ వచ్చింది.. 'మీ పేరుతో రెండు మొబైల్ నంబర్లున్నాయి.. రెండో మొబైల్ నంబర్ అంధేరీలోని వెస్ట్ ముంబై అడ్రస్‌లో ఉందం'టూ మాట్లాడారు. తనకు ఒకటే ఫోన్ నంబర్ ఉన్నదని, రెండో నంబర్ ఎవరిదో తనకు తెలియదంటూ బాధితుడు చెప్పినా.. వాళ్లు వినలేదు. 'అయితే మీ పేరుపై మహారాష్ట్రలో కేసు నమోదైంది. ఫలానా నంబర్‌లో మాట్లాడుకోండి.. వాళ్లు అరెస్ట్‌కు సంబంధించిన వ్యవహారాన్ని చూసుకుంటారంటూ ఆ నంబర్ చెప్పి ఫోన్ పెట్టేశారు. ఆ నంబర్‌కు ఫోన్ చేస్తే.. 'మేం సైబర్ క్రైమ్ డిపార్టుమెంట్ వాళ్లం. రాజ్ కుంద్ర మనీ లాండరింగ్ కేసులో మీకు కనెక్షన్లు ఉన్నట్లు అనుమానాలున్నాయి. ముంబైకి మీరు రావాల్సి వస్తుంది. ఈ కేసు సీబీఐ చూస్తుంద'ంటూ బెదిరింపులకు దిగారు. మరుసటి రోజు వీడియో కాల్ చేసి..చాలా సీరియస్ కేసు, మిమ్మల్ని అరెస్ట్ చేసి.. మీ ఇంట్లో ఉన్న జ్యువెల్లరీ, ఇండ్లు సీజ్ చేస్తారం'టూ బెదిరించారు. మీ బ్యాంకు ఖాతాలు చూడాలంటూ.. బాధితుడి చేతుల మీదుగా అతడికి ఉన్న రెండు బ్యాంకు ఖాతాలోని రూ.15.86 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్లను రద్దు చేయించి.. ఆ డబ్బును తమ ఖాతాలో డిపాజిట్ చేయించారు. మళ్లీ రేపు ఉదయం ఫోన్ చేస్తామం'టూ కాల్ కట్ చేసిన సైబర్‌నేరగాళ్లు.. ఫోన్లు స్విచ్ఛాఫ్ చేశారు. బాధితుడు ఈ మోసాన్ని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.



## వరద నీటి నివారణపై ప్రత్యేక దృష్టి

### కమిషనర్ రొనాల్డ్ రాస్

సిటీబ్యూరో, జూన్ 6 (నమస్తే తెలంగాణ ) : గ్రేటర్ వరద నీటి నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ అధికారులను ఆదేశించారు. గురువారం శేరిలింగంపల్లి జోన్ మాదాపూర్ సర్కిల్‌లో జోనల్ కమిషనర్ స్నేహ శబరీష్‌తో కలిసి కమిషనర్ మాదాపూర్ బాటా షోరూం, యశోద దవాఖాన, శిల్పారామం తదితర ప్రాంతాల్లో వాటర్ స్టాగ్నేషన్ పాయింట్లను పరిశీలించారు. వరద నీరు నిలువకుండా శాశ్వత చర్యలు చేపట్టేందుకు అవసరమైన ప్రతిపాదనలు పంపాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. త్రిశూల్ గ్రాండ్ వద్ద సైడ్ రోడ్డు ప్రతిపాదనకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని, బాటా షోరూం వద్ద సైడ్ వెంట్స్ క్లియర్, డీసిల్టింగ్ చేయాలని, విక్రమ్ దవాఖాన రోడ్డులో కొత్త బాక్స్ డ్రైన్‌ను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. శిల్పారామానికి పక్కన గల స్థలంలో రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ పిట్ ఏర్పాటుకు, శిల్పారామంకు ఎదురుగా ల్యాండ్‌కు క్లియరెన్స్ ఇవ్వాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ శంకర్, డిప్యూటీ కమిషనర్ పాల్గొన్నారు.

### ఆన్‌లైన్ దరఖాస్తులను పరిష్కరించాలి

జీహెచ్ఎంసీలో ఆన్‌లైన్ దరఖాస్తుల పరిష్కారం వేగవంతం చేయాలని కమిషనర్ రొనాల్డ్ రాస్ తెలిపారు. 'మై జీహెచ్ఎంసీ యాప్, జీహెచ్ఎంసీ వెబ్‌సైట్, డయల్ 100, కాల్ సెంటర్‌కు ఆన్‌లైన్ ద్వారా వచ్చిన ఫిర్యాదులను ఆయా శాఖల అధికారులు త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. గురువారం జీహెచ్ఎంసీలో వివిధ శాఖల ఉన్నతాధికారులతో జీహెచ్ఎంసీకి సంబంధించి వివిధ సమస్యలపై ఆన్‌లైన్‌లో వచ్చిన పెండింగ్ ఫిర్యాదులపై సమీక్షించారు. శాఖల వారీగా వచ్చిన గ్రీవెన్స్‌ను ప్రతి రోజు హెచ్‌వోడీలు పరిశీలించాలని, ఫిర్యాదు రాగానే సంబంధిత ఫిర్యాదుదారుడికి కాల్ చేసి తెలుసుకోవాలని సూచించారు. పరిష్కరించిన వెంటనే కాల్ చేయాలని సూచించారు. ఆయా శాఖలకు వచ్చిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలన్నారు. ఆయా విభాగాలకు సంబంధించిన ఫిర్యాదులన్నింటిని ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేయాలని, ప్రజలు, ఫిర్యాదుదారులు ఫోన్ చేసినప్పుడు తప్పనిసరిగా స్పందించాలని తెలిపారు. ఈ సమావేశంలో ఆయా విభాగాల హెచ్‌వోడీలు శ్రీ వాత్సవ, స్నేహ శబరీష్, ఈఎన్‌సీ జియా వుద్దీన్, సీఈ దేవానంద్, అడిషనల్ కమిషనర్లు రవి కిరణ్, ఉపేందర్ రెడ్డి, యాదగిరి రావు, సత్యనారాయణ, నళిని పద్మావతి, మంగతాయారు, సునంద పాల్గొన్నారు.

## సిద్ధమవుతున్న యూనిఫాంలు



తుంకిమెట్లలో యూనిఫాం కుడుతున్న మహిళలు

- వికారాబాద్ జిల్లాలో 94 మహిళా శక్తి కుట్టు కేంద్రాలకు యూనిఫాం కుట్టే బాధ్యతలు
- ఇప్పటివరకు 85 శాతం కుట్టుపని పూర్తి
- 72,764 మంది విద్యార్థులకు ఒక జత చొప్పున పంపిణీకి ఏర్పాట్లు

బొంరాస్‌పేట, జూన్ 6 : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం ఏటా ఏకరూప దుస్తులను(యూనిఫాంలు) ఉచితంగా పంపిణీ చేస్తున్నది. పాఠశాలల పునఃప్రారంభం రోజే పాఠ్య, నోటు పుస్తకాలతో పాటు యూనిఫాంలను కూడా విద్యార్థులకు పంపిణీ చేయడానికి విద్యాశాఖ సన్నాహాలు చేస్తున్నది. మహిళలకు ఉపాధి లభిస్తుందని గత ఏడాది నుంచి యూనిఫాం కుట్టే బాధ్యతలను మహిళా సంఘాలకు ప్రభుత్వం అప్పగించింది. ఈ ఏడాది కూడా ప్రభుత్వం విద్యార్థుల యూనిఫాంను కుట్టే పనిని మహిళా సంఘాలకు అప్పగించింది. యూనిఫాం కుట్టు పని ద్వారా మహిళలు ఉపాధి పొందుతున్నారు. వికారాబాద్ జిల్లాలో ఏకరూప దుస్తులు కుట్టే పని ముమ్మరంగా కొనసాగుతున్నది. జిల్లాస్థాయి అధికారులు మహిళా శక్తి కుట్టు కేంద్రాలను సందర్శించి యూనిఫాం కుట్టే పనులను పరిశీలించారు. ఒక్కో విద్యార్థికి రెండు జతల యూనిఫాంను పంపిణీ చేయాల్సి ఉండగా ప్రస్తుతానికి ఒక జత యూనిఫాం కుట్టడానికి అవసరమ్యే వస్త్రాన్ని మహిళా సంఘాలకు సరఫరా చేశారు. జిల్లాలోని 19 మండలాల్లో 950 పాఠశాలలు ఉండగా వీటిలో చదువుతున్న 72,764 మంది విద్యార్థులకు ఒక జత ఏకరూప దుస్తులు ఇవ్వాలని నిర్ణయించారు. ఒక్కో జతకు కుట్టు కూలీ రూ.50 అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. జూన్ 12వ తేదీలోగా పాఠశాలలకు కుట్టిన యూనిఫాంను అందజేయడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.



### జిల్లాలో 94 మహిళా శక్తి కుట్టు కేంద్రాలు..

విద్యార్థుల ఏకరూప దుస్తులు కుట్టడానికి వికారాబాద్ జిల్లాలోని 19 మండలాల్లో 94 మహిళా శక్తి కుట్టు కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. నవాబ్‌పేటలో 7, వికారాబాద్‌లో 4, పరిగిలో 2, మర్పల్లిలో 3, యాలాలలో 3, కోట్‌పల్లిలో 4, బంటారంలో 5, తాండూరులో 6, బషీరాబాద్‌లో 9, బొంరాస్‌పేటలో 5, ధారూరులో 5, పూడూరులో 4, పెద్దేముల్‌లో 4, కొడంగల్‌లో 4, మోమిన్‌పేటలో 5, కులకచర్లలో 9, దోమలో 6, దౌల్తాబాద్‌లో 5, చౌడాపూర్‌లో 4 కుట్టు కేంద్రాలను అధికారులు ఎంపిక చేశారు. వీటిలో 743 మంది మహిళలు యూనిఫాం కుడుతున్నారు. బుధవారం నాటికి 85 శాతం కుట్టుపని పూర్తయిందని అధికారులు తెలిపారు. పూర్తయిన యూనిఫాంను ప్యాకింగ్ చేసి పాఠశాలలకు చేరవేస్తున్నారు.

### కుట్టుకూలీపై అసంతృప్తి..

ఏకరూప దుస్తులు కుట్టడానికి ప్రభుత్వం నిర్ణయించిన ధరపై మహిళలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బయట టైలర్లు ఒక్కో జత కుట్టడానికి రూ.300ల నుంచి రూ.400లు వసూలు చేస్తుంటే ప్రభుత్వం మాత్రం ఒక జతకు రూ.50లుగా నిర్ణయించింది. ఇది చాలా తక్కువని మహిళలు పెదవి విరుస్తున్నారు. బటన్లు, దారం ఇతర ధరలు బాగా పెరిగాయని ప్రభుత్వం ఇచ్చే కూలీ ఏమాత్రం గిట్టదని వారు చెబుతున్నారు. జతకు రూ.75లు చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించినా ఇంకా ఉత్తర్వులు రాలేదని అధికారులు చెబుతున్నారు. అదేవిధంగా యూనిఫాం కుట్టే పనిని తొలిసారిగా మహిళలకు ఇవ్వడంతో కుట్టుపనిలో ఎంత నాణ్యత ఉంటుందని కొంతమంది అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

### ఉపాధి లభిస్తుంది : కావలి చరిత, కుట్టు కేంద్రం నిర్వాహకురాలు, తుంకిమెట్ల

విద్యార్థుల యూనిఫాం కుట్టే పనిని మహిళా సంఘాలకు ఇవ్వడం వల్ల మాకు ఉపాధి లభిస్తున్నది. ముమ్ముందు కూడా దీనిని కొనసాగించాలి. కానీ ప్రభుత్వం ఇస్తున్న కూలీ మాత్రం గిట్టడం లేదు. ఒక యూనిఫాం కుట్టాలంటే బయట రూ.300ల వరకు తీసుకుంటున్నారు. అన్నీ ధరలు పెరిగాయి. కుట్టిన యూనిఫాంకు బటన్లు, కాజలు వేయడానికి తాండూరుకు తీసుకెళ్లాలి. ట్రాన్స్‌పోర్ట్ చార్జీలు మాపైనే పడుతున్నాయి. ప్రభుత్వం జతకు రూ.100 అయినా చెల్లించాలి.

### 85 శాతం కుట్టు పని పూర్తయింది : శ్రీనివాస్, డీఆర్‌డీవో



ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందించే యూనిఫాంలను మహిళల ద్వారా కుట్టిస్తున్నాం. జిల్లాలో 94 కుట్టు కేంద్రాలు ఏర్పాటు చేశాం. ఇప్పటి వరకు 85 శాతం కుట్టు పని పూర్తయింది. కుట్టిన యూనిఫాంను ప్యాక్‌చేసి పాఠశాలలకు చేరవేస్తున్నాం. 12 లోపు అన్ని పాఠశాలలకు యూనిఫాం అందజేస్తాం. ప్రస్తుతానికి ఒక జతకు సరిపోయే వస్త్రాన్ని ఇచ్చారు. ఇంకో జత వస్త్రం వచ్చిన తరువాత దానిని కూడా మహిళలకు అందజేస్తాం. ఒక జత యూనిఫాం కుట్టడానికి కూలీ రూ.50లుగా ప్రభుత్వం నిర్ణయించింది. పెంచిన కూలీపై ఇంకా అధికారికంగా ఉత్తర్వులు రాలేదు.

## పెండింగ్ పనులను పూర్తి చేయాలి

- ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండాలి
- వికారాబాద్ కలెక్టర్ సి.నారాయణరెడ్డి
- ఆయా శాఖల అధికారులతో టెలీకాన్ఫరెన్స్



వికారాబాద్, జూన్ 6 : పరిపాలనా పరంగా కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న పనులన్నీ వెంటనే పూర్తి చేయాలని వికారాబాద్ కలెక్టర్ సి. నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే అధికారి నుంచి అటెండర్ వరకు ప్రతి ఒక్కరూ ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలందించాలన్నారు. గురువారం ఆయా శాఖల అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించిన ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలు సజావుగా నిర్వహించినందుకు అధికారులందరికీ అభినందనలు తెలిపారు. ఉద్యోగులు అటెండెన్స్ యాప్‌ను ఉపయోగించాలన్నారు. సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి ఆయా విభాగాల జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. విద్యా సంవత్సరం త్వరలో ప్రారంభమవుతున్నదని.. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రభుత్వ బడుల్లో శానిటేషన్, తాగునీరు వంటి సౌకర్యాలు త్వరితగతిన కల్పించాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. బడిబాట కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకొని బడీడు పిల్లలను స్కూళ్లలో చేర్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రారంభం రోజున పాఠశాలలను అందంగా తీర్చిదిద్దాలని, టెక్ట్స్, నోట్ బుక్స్, యూనిఫామ్స్ పంపిణీ చేయాలన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో జడ్పీ సీఈవో సుధీర్, డీఆర్‌డీవో శ్రీనివాస్ , డీఈవో రేణుకా దేవి, జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## బడిబాటను విజయవంతం చేయాలి

- ఈనెల 6 నుంచి 19 వరకు బడిబాట కార్యక్రమం : జిల్లా కలెక్టర్ శశాంక
- నర్కుడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో లాంఛనంగా ప్రారంభించిన కలెక్టర్



బడిబాట కార్యక్రమంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ శశాంక

రంగారెడ్డి. జూన్ 5(నమస్తే తెలంగాణ): బడీడు పిల్లలందరినీ బడిలో చేర్పించాలనే సంకల్పంతో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని జిల్లాలో ఈ నెల 6 నుంచి 19 వరకు నిర్వహిస్తున్నట్లు రంగారెడ్డి కలెక్టర్ శశాంక అన్నారు. గురువారం రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం నర్కుడ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన బడిబాట కార్యక్రమానికి కలెక్టర్ శశాంక ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుకు దూరమైన పిల్లలను తిరిగి పాఠశాలల్లో చేర్పించడమే ప్రభుత్వం ఉద్దేశమన్నారు. ఈ నెల 19 వరకు నిర్వహించే బడిబాట కార్యక్రమాన్ని జిల్లా యంత్రాంగం సమన్వయంతో పని చేసి విజయవంతం చేయాలన్నారు. బడి బయట పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. విద్య అనేది ప్రాథమిక హక్కు అని, ప్రతి ఒక్కరూ విద్యను అభ్యసించాలన్నారు. హైదరాబాద్‌కు చెంతనే ఉండి వేగంగా అభివృద్ధి చెందుతున్న రంగారెడ్డి జిల్లాలో నిర్మాణాలు అధికంగా చేపడుతున్నారన్నారు. ఇలాంటి నిర్మాణాలు జరుగుతున్న పరిసరాలలో పని చేస్తున్న పిల్లలను గుర్తించి వారందరినీ బడుల్లో చేర్పించేలా చూడాలని టీచర్లకు సూచించారు. అంగన్‌వాడీలో చదువుతున్న 5 సంవత్సరాల వయస్సు పైబడిన పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా అంగన్‌వాడీ టీచర్లు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ బడుల్లో ఉన్నత చదువులు చదివి, శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ఉంటారని, ఈ విషయాన్ని తల్లిదండ్రులకు వివరించి చైతన్యపర్చాలన్నారు. పదవ తరగతిలో 9.7 జీపీఏ సాధించిన నర్కుడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు కార్తీక వీణ, అనుష్కలను కలెక్టర్ సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి సుశీందర్‌రావు, శంషాబాద్ తహసీల్దార్ నాగమణి, ఎంపీడీవో మున్నీ, సీడీపీవో షబానా, ఎంఈవో రాంరెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ మౌనిక, ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## ఓటర్ల సంఖ్యలో చేవెళ్ల రికార్డ్



రంగారెడ్డి, జూన్ 6(నమస్తే తెలంగాణ) : లోక్‌సభ ఓటింగ్ సరళిలో చేవెళ్ల ప్రత్యేకతను చాటుకున్నది. పెరిగిన ఓటర్లతో చేవెళ్ల లోక్‌సభ ఈసారి ఎన్నికల్లో రికార్డు సృష్టించింది. గతంతో పోలిస్తే ఈసారి 3,58,154 (27.57శాతం) మంది ఓటర్లు పెరిగారు. రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాల కంటే చేవెళ్లదే అగ్రస్థానమని అధికారులు చెబుతున్నారు. స్వీప్(సిస్టమెటిక్ ఓటరు ఎడ్యుకేషన్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్) కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ శశాంక ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాలు సత్ఫలితాలు ఇవ్వడంతోనే ఇది సాధ్యపడిందని అధికారులు పేర్కొంటున్నారు.

### ఎన్నికల సంఘం ప్రత్యేక ఫోకస్..

లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల ఎంపీ స్థానం పరిధిలో తక్కువ ఓటర్ల సంఖ్య నమోదవుతూ వస్తున్నది. ఈ ఎంపీ స్థానంలో చాలావరకు అసెంబ్లీ నియోజకవర్గాలు జీహెచ్ఎంసీ పరిధిలోకి వస్తాయి. ఓటర్లు ఆసక్తి చూపకపోవడంతో 2014 ఎన్నికల్లో చేవెళ్ల లోక్ సభ పరిధిలో 60.05 శాతం పోలింగ్ నమోదు అయింది. 2019 ఎన్నికలకు వచ్చేసరికి పోలింగ్ శాతం 53.18 శాతానికి తగ్గింది. గత ఏడాది చివరలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లోనూ రంగారెడ్డి జిల్లాలోని పలు అసెంబ్లీ నియోజకవర్గాల్లో తక్కువ పోలింగ్ నమోదైంది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో 62 శాతం పోలింగ్ నమోదవగా.. 2023 ఎన్నికల్లో 59.96 శాతం మాత్రమే పోలైంది. గ్రామీణ ప్రాంతాల్లో ఓటర్లు పోటెత్తగా.. పట్టణాల్లోని ఓటర్లు మాత్రం పెద్దగా ఆసక్తి చూపకపోవడంతో ఈ రెండు ఎన్నికల మధ్య పోలింగ్ శాతం 2 శాతం తగ్గింది. ఈ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం ఓటింగ్ శాతాన్ని పెంచడంపై ప్రత్యేక ఫోకస్ పెట్టింది. ఈ మేరకు జిల్లాయంత్రాంగం ఈసీ మార్గ నిర్దేశం మేరకు ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేసి అమలు చేసింది. ఓటింగ్ నమోదు నుంచి పోలింగ్ వరకు స్వీప్ ఆధ్వర్యంలో చేవెళ్ల పార్లమెంటు స్థానం పరిధిలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. రాష్ట్రంలోనే అత్యధిక ఓటర్లు ఉన్న శేరిలింగంపల్లి నియోజకవర్గంలో 2కే రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

### ఫలించిన మూడంచెల వ్యూహం..

పోలింగ్ రోజున పట్టణ వాసులు ఓటింగ్‌కు దూరంగా ఉంటున్నారు. ముఖ్యంగా ఓటింగ్‌పై యువత సైతం అశ్రద్ధగా ఉంటున్నది. పోలింగ్ రోజున సెలవు ప్రకటించడంతో చాలామంది సెలవు దినాన్ని ఓటు హక్కుకోసం వినియోగించుకోక ఇంటి పట్టునే ఉంటున్నారు. ఒకే కుటుంబంలోని ఓటర్లను వేర్వేరు పోలింగ్ బూత్‌లకు కేటాయించడం, క్యూలో వెయిట్ చేయడం వంటి కారణాలు తక్కువ ఓటింగ్‌కు కారణమవుతున్నాయని గుర్తించి ఆ మేరకు తగురీతిలో చర్యలు చేపట్టారు. మూడంచెల వ్యూహంలో భాగంగా.. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో భిన్నమైన వ్యూహాలను అమలుపర్చారు. యువతతోపాటు ఐటీ, ప్రైవేటు సంస్థల ఉద్యోగులు పోలింగ్ రోజున ఓటు హక్కును వినియోగించుకునేలా సమావేశాలు నిర్వహించి ఓటు ప్రాధాన్యతను వివరించారు. ఈసారి కొత్తగా పాఠశాల విద్యార్థులను భాగస్వాములను చేసి 'తెలంగాణ ఓటరు సంకల్ప పత్రం' పేరుతో వినూత్న ప్రచారాన్ని చేపట్టారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని విద్యార్థులకు సంకల్ప పత్రాలను అందజేసి వారి ద్వారా ఓటు ఆవశ్యకతపై కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించారు. మరోపక్క వాల్ పోస్టర్లు, ఫ్లెక్సీలు, హోర్డింగులతో ఓటు విలువ తెలిసేలా ఏర్పాట్లు చేసి చైతన్యపర్చారు.

### రాష్ట్రంలోనే అగ్రస్థానం..

ఓటర్ల పరంగా చూస్తే..2019 ఎన్నికల్లో 12,98,953 ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకుంటే..ప్రస్తుత ఎన్నికల్లో 16,57,107 మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. గత ఎన్నికతో పోలిస్తే ఈసారి ఎన్నికల్లో 3,58,154 (27.5శాతం) ఓటర్లు పెరిగారు.

**ఎంపీ నియోజకవర్గాలవారీగా పోలింగ్ శాతం ఇలా..**

| లోక్‌సభ | 2019 | 2024 | పెరిగింది |
| --- | --- | --- | --- |
| చేవెళ్ల | 53.18 | 56.40 | 3.21 |
| మహబూబ్‌నగర్ | 65.37 | 72.43 | 7.06 |
| మల్కాజిగిరి | 49.58 | 50.78 | 1.20 |
| నాగర్‌కర్నూలు | 62.31 | 69.46 | 7.15 |
| భువనగిరి | 74.42 | 76.78 | 2.36 |

**ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 2019, 2024 లోక్ సభ ఎన్నికల్లో ఓటర్ల సంఖ్య ఇలా..**

| లోక్‌సభ | 2019 | 2024 | పెరిగింది | శాతం |
| --- | --- | --- | --- | --- |
| చేవెళ్ల | 12,98,953 | 16,57,107 | 3,58,154 | 27.57 |
| మహబూబ్‌నగర్ | 9,83,891 | 12,18,587 | 2,34,696 | 23.85 |
| మల్కాజిగిరి | 15,61,400 | 19,19,131 | 3,57,731 | 22.91 |
| నాగర్‌కర్నూలు | 9,89,048 | 12,07,470 | 2,18,422 | 22.08 |
| భువనగిరి | 12,11,256 | 13,88,680 | 1,77,424 | 14.65 |





ఇంకుడు గుంతల నిర్మాణాలపై సమీక్షిస్తున్న రెవెన్యూ డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్‌కుమార్

## ఇంకుడు గుంతల నిర్మాణాలపై జలమండలి సర్వే

సిటీబ్యూరో, జూన్ 6 (నమస్తే తెలంగాణ) : వాటర్ ట్యాంకర్ల డిమాండ్ అధికంగా ఉన్న ప్రాంతాల్లో ఇంకుడు గుంతల నిర్మాణానికి జలమండలి సర్వే కొనసాగుతున్నది. ఈ నేపథ్యంలో ఇంకుడు గుంతల సర్వేపై ఖైరతాబాద్ సంస్థ ప్రధాన కార్యాలయంలో గురువారం రెవెన్యూ డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్‌కుమార్ సమీక్షించారు. ఈ వేసవిలో భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో దాదాపుగా 30వేలకు పైగా కుటుంబాలు అధికంగా వాటర్ ట్యాంకర్లు బుక్ చేసుకున్నాయి. ఆ ప్రాంతాల్లో మళ్లీ ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా ఉండేందుకు మొత్తం 18 స్వచ్ఛంద సంస్థల ద్వారా జలమండలి ఇంకుడు గుంతల సర్వే చేపట్టింది. ఈ సంస్థలకు చెందిన ప్రతినిధులు ఇంకుడు గుంతల నిర్మాణానికి సంబంధించి.. ఇప్పటికే 4736 కుటుంబాలపై సర్వే చేశారని రెవెన్యూ డైరెక్టర్ తెలిపారు. వీరంతా ఆయా కుటుంబాలకు ఇంకుడు గుంతల నిర్మాణం ఆవశ్యకత, అవగాహన కల్పించారని పేర్కొన్నారు. ఫలితంగా 2884 కుటుంబాలు ఇంకుడు గుంతలు నిర్మించుకున్నాయని వెల్లడించారు. 296 కుటుంబాలు వినియోగంలో లేని వాటికి మరమ్మతులు చేసుకున్నట్లు వివరించారు. మిగిలిన 1852 కుటుంబాలు ఇంకుడు గుంతలను నిర్మించుకోవాల్సి ఉన్నదన్నారు. ఆయా కుటుంబాలకు ఇంకుడు గుంతలు నిర్మించుకునేలా సలహాలు, సూచనలు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సమీక్షలో ఇంకుడు గుంతల మాజీ ప్రత్యేకాధికారి జాల సత్యనారాయణ, సింగిల్ విండో సెల్ జీఎం దామోదర్ రెడ్డి, స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.